సిద్ధార్థ మహంత బిజినెస్ వరల్డ్ సంస్థకు వైస్ ప్రెసిడెంట్‌ను చేసే కార్యక్రమ వేదిక సిద్ధమయింది.

ఆశోకా కాన్ఫరెన్స్ హాల్లో మెటల్ డిటెక్టర్స్ అమర్చారు.......మహంత పర్సనల్ సెక్యూరిటీ స్టాఫ్‌తో పాటు, స్పెషల్ పోలీస్ ఫోర్స్ సెక్యూరిటీ నియమించబడింది. అశోకా హోటల్‌కి వచ్చే ప్రధాన వీధుల్లో మామూలు ట్రాఫిక్‌ను పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా డైవర్ట్ చేశారు.

సరిగ్గా--

ఉదయం 8-45 నిమిషాలకు ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో డి.సి. 8 స్పెషల్ ఫ్లయిట్లోంచి దిగాడు మహంత!

దాదాపు యాభై కార్లు వెంట రాగా, మహంత అశోకా ఇంటర్నేషన్‌కు చేరుకున్నాడు.

అరగంటి గడిచింది.

గెస్టులతో పరిచయాలు, పలకరింపులు.

అందరి కళ్ళూ మహంత మీదే వున్నాయి. కానీ మహంత ఆలోచనలన్నీ సిద్ధార్థ మీదే వున్నాయి.

సిద్ధార్థ ఎక్కడ? అతని ప్రశ్నకు జవాబివ్వాల్సిన ప్రమోద్ కోసం అన్వేషణ ప్రారంభమైంది.

సరిగ్గా------

10.30 నిమిషాలకు ఫంక్షన్ ప్రారంభమైంది.

టెన్షన్ టెన్షన్‌గా సూట్లో పచార్లు చేస్తున్న మహంత మనసేదో కీడును శంకిస్తోంది.

అతని బిజినెస్ లైఫ్‌లో ఏ ప్రోగ్రామ్, ఎప్పుడూ పోస్ట్‌ఫోన్ కాలేదు. తనే స్వయంగా హాట్‌లైన్లో ముస్సోరీకి, బొంబాయికి ఫోన్ చేశాడు.

నో రిప్లయ్......

సిద్ధార్థ......సిద్ధార్థ......సిద్ధార్థ .....ఎక్కడ?

9-45 నిమిషాలు దాటింది.

* * * * * * * * * * *

"వర్షంలో చీకటి.......చీకట్లో వర్షం .......ఒంటరి గదిలో మనం......." సోఫా మీద నిశాంత వైపు జరుగుతూ మెల్లగా అన్నాడు.

ఎక్కడో ఏదో భయం. విండో గ్లాస్ మీద పడుతున్న వీధి లైటు సన్నటి వెలుతురు వైపు చూస్తోంది నిశాంత.

"ఏదైనా మాట్లాడు నిశాంతా! లేకపోతే నిన్ను మాట్లాడనివ్వకుండా చేసేస్తాను........" ఆమె పెదవుల మీద చేత్తో రాస్తూ అన్నాడు సిద్ధార్థ.

అదే సమయంలో ఏదో నీడ ముందుకు కదిలినట్టు వూపిరి బిగపట్టింది.

"సి..........ద్ధా.......... ర్థా......." మెల్లగా గొణిగింది.

సరిగ్గా అదే సమయంలో తలుపు చప్పుడైంది.

అతను ఒక్కసారిగా ఎలర్ట్ అయ్యాడు.

"డోన్ట్‌వర్రీ....." లేచీ డోర్ వైపు వెళ్ళబోయిన అతని చేయి పట్టుకుని వెనక్కి లాగింది నిశాంత.

"ఉయ్ అర్ ఇన్ డెంజర్! నీ ఎలర్ట్......" అతని చెవికి సన్నగా వినిపించిందా మాట.

సిద్ధార్థ నిశాంత చేయి పట్టుకుని డ్రాయింగ్ రూమ్‌లోంచి మెయిన్ హాల్లోకి వచ్చాడు.

"డాబా మీంచి దూకి తప్పించుకుందాం" అన్నాడాతను.

అంతలోనే ఫ్రంట్ డోర్ దబదబ బాదుతున్న చప్పుడు, విండో గ్లాసెస్‌ని పగలగొడుతున్న చప్పుడు

మరేమాత్రం ఆలస్యం చేయలేదు సిద్ధార్థ డాబా మెట్ల వైపు పరుగు తీశాడు.

అంతా చీకటి.......

దూరంగా చెట్టు కింద కనిపిస్తున్న కారు......

డాబాకి ఆనుకుని కొబ్బరి చెట్టు. డాబా మీద కాలు వేసి కొబ్బరి రెమ్మను అందుకున్నాడు సిద్ధార్థ.

తనో రెమ్మను ముందుకు లాగింది.

మూడు నిమిషాలు గడిచాయి.

కిందకి దిగి గెస్ట్‌హౌస్ వెనక్కి పరుగెత్తుబోయిన సిద్ధార్థ పిస్టల్‌తో ఎదురుగా నిల్చున్న వ్యక్తిని చూసి-

షాక్ తిన్నాడు

సిద్ధార్థ వెనక అతని భుజాన్ని గట్టిగా పట్టుకుంది నిశాంత.

"మర్యాదగా మాతో రండి" ముందుకు వస్తూ అన్నాడతను.

సరిగ్గా అదే సమయంలో.

గెస్ట్‌హౌస్ ముందు ఓ కారొచ్చి ఆగింది.

ఆ కారు హెడ్‌లైట్ కాంతి నుంచి తప్పించుకోడానికి పక్కకు జరిగిన వాడ్ని.

ఎగిరి తన్నాడు సిద్ధార్థ. వూహించిన ఆ దెబ్బకు అతను కింద పడ్డాడు. పిస్టల్ ఎగిరి పచ్చిక మీద పడిపోయింది.

రెప్పపాటు క్షణంలో ఆ పిస్టల్‌ని అందుకుని, నిశాంత చేతిని పట్టుకుని ముందుకు పరుగెత్తాడు సిద్ధార్థ

అదే సమయంలో పక్కనుంచు వస్తున్న యింకో వ్యక్తిని గురిచూసి కాల్చాడు........

చీకట్లో అంతా గందరగోళం

అరుపులు.......కేకలు.......

అయిదే అయిదు నిమిషాలు-

గోడదూకి రోడ్డు మీద పరుగెడుతున్నారు వాళ్ళిద్దరూ.

నాలుగు అంతస్తుల ప్లాట్స్ మధ్య, కంకరాళ్ళమీద పరిగెడుతున్నారు.

వెనక-

దేశ్‌ముఖ్ మనుషులు........

ఆ వెనక-------

అప్పుడే గెస్ట్ హౌస్ ముందు కారాపి, పరిస్థితి గమనించి నిశాంతతో సహా పారిపోతున్న సిద్ధార్థను చూసి వెంబడించాడు-

ప్రమోద్ తన మనుషులతో.

కార్ల వెల్తురు తప్ప అంతా చీకటి.

అరగంట గడిచింది.

అప్పటికే బాగా అలసిపోయారు వాళ్ళిద్దరూ.

కంకర రాళ్ళమీద పరిగెత్తడం వల్ల అరిపాదాలు రక్తం చిమ్ముతున్నాయి.

చెమట.....నీరసం.....దుఃఖం......

"నేను మరి పరిగెత్తలేను" బాధగా అంటూ కూలబడిపోయింది నిశాంత.

ఇరవై అడుగుల దూరంలో వున్న సిద్ధార్థ మళ్ళీ వెనక్కి మరి గెత్తుకు రాబోతూ-

అడ్డంగా వచ్చిన కారుని చూసి నిశ్చేష్టుడైపోయాడు.

ఆ కార్లోంచి దిగిన దేశ్‌ముఖ్ మనుషులు బలంగా అతన్ని కదలకుండా పట్టేశారు.

"సిద్ధార్థా......" వంట్లో శక్తినంతా కూడదీసుకుని అరిచింది నిశాంత.

లేవబోయి తనెదురుగా చేతిలోని పిస్టల్‌తో నిల్చున్న ప్రమోద్‌ని చూసి బాధగా మూలిగింది నిశాంత మనసు.

అప్పుడు రాత్రి 11.45 నిమిషాలు దాటింది.

* * * * * * * * *

10.05 నిమిషాలు ........

మహంత అసహనం కోపంగా, ఆ కోపం రౌద్రంగా మారడానికి ఇంకొన్ని క్షణాలు చాలు.

"హలో మై ఫ్రెండ్! హౌ ఆర్యూ?" ఆ గొంతు విన్పించిన వైపు చూశాడు మహంత.

ఠీవిగా లొనికొస్తున్న దేశ్‌ముఖ్.

“మిస్టర్ మహంతా! ఎవడి కోసం నువ్వు ఎదురు చూస్తున్నావో, నీ సామ్రాజ్యానికి ఎవడ్ని నువ్వు యువరాజుని చెయ్యబోతున్నావో వాడు రాడు” గంభీరంగా విన్పించిన దేశ్‌ముఖ్ గొంతులో కలిసిన క్రూరత్వపు కాఠిన్యత.

మ్రాన్పడిపోయాడు మహంత-

“ఏమయ్యాడు సిద్ధార్థ?” ఉద్వేగంగా అడిగాడు మహంత.

“ముందు నా ప్రశ్నకు జవాబు చెప్పు. గెలుపు నీదా నాదా?”

“ఏ గెలుపు?”

“మరిచిపోయావా.......మర్చిపోయినట్లు నటిస్తున్నావా? మహంత......నీలాంటి వంద మంది మహంతల్ని తయారు చెయ్యగలిగే బ్రెయిన్ నాది. చూశావా నీతో ఛాలేంజ్ చేయించాను. రోడ్డు మీద పోయే ఒక అమ్మాయితో ఎందుకూ కొరగాని అమ్మాయితో నీ కొడుకుని బేవర్సుగాడిలా చేయించాను. నీ యువరాజు డ్రింక్స్‌కీ, డ్రగ్స్‌కీ, అమ్మాయిలకీ బానిసై, ఒక ఆర్డినరీ ఆడపిల్ల పిచ్చిలో, నిన్ను కూడా బేఖాతర్ చేసే స్థితికి తెచ్చాను.
నేను గొప్పవాడ్నా......నువ్వు గొప్పవాడివా? నేను గెలిచానా......నువ్వు గెలిచావా? చెప్పు! ఐ వాంట్ ఆన్సర్.”

ఉద్రేకంగా ప్రశ్నిస్తున్న దేశ్‌ముఖ్ వైపు సూటిగా చూస్తున్నాడు మహంత.

ఒక్క క్షణం బాధగా, అసహనంగా చేతి వేళ్ళతో నుదుటి చర్మాన్ని నొక్కుకున్నాడు అతను.

నవ్వాడు దేశ్‌ముఖ్-

“ఓడిపోయావ్ కదూ........ఏమయ్యాయి నీ లక్, నీ టైం ఏమైంది నీ ఆశయం.....ఒక బలియనీర్‌ని కుక్కలా నా కాళ్ళ దగ్గర నిలబెట్టాను ఆ కుక్క ఎవరో తెలుసా .......నువ్వు”

మహంత ఏం మాట్లాడ లేదు. సూటిగా అతని కళ్ళల్లోకి చూశాడు.

“సిద్ధార్థ ఎక్కడ?” నెమ్మదిగా అడిగాడతను. దేశ్‌ముఖ్ జవాబు చెప్పలేదు.

“నేను ఓడిపోయానని ఒప్పుకుంటున్నాను మిస్టర్ దేశ్‌ముఖ్! నా యావదాస్తిని ఇప్పుడే ఇక్కడే ఈ మీటింగ్‌లోనే నీకు రాసిస్తాను........సిద్ధార్థ ఎక్కడ......?

గబుక్కున దేశ్‌ముఖ్ మహంత ముందుకు నడిచి, మొహంలో మొహం పెట్టి చూసి-

“బోడి......నీ ఆస్థి ఎవడికి కావాలి? కావలిస్తే నా ఆస్థి కూడా దానంగా ఇస్తాను తీసుకో. ఆ దానంతో పాటు నీకు అపురూపమైన గిఫ్టు కూడా యిస్తాను......నువ్వు జీవితంలో మరిచిపోలేని కానుక జీవితాంతం నువ్వు కుళ్ళి, కుళ్ళి ఏడ్చే కానుక. ఆ కానుక ఏంటో తెలుసా.......

నీ కొడుకే. కానీ వాడు నీతో మాట్లాడలేడు. వాడు నువ్వు చెప్పింది వినలేడు......”

“మిస్టర్ దేశ్‌ముఖ్...!” ఒక్క సారిగా అరిచాడు మహంత.

"అరువ్......బాగా అరువ్ గుండెలు పగిలేలా అరువ్.....నీ నరాల్లో రక్తం ఇంకిపోయేవరకూ అరువ్ నీకళ్ళల్లో నాళాలు తెగిపోయేవరకూ అరువ్ నువ్విలా అరుస్తుంటే చూస్తూ ఆనందిస్తాను...... పన్నీరు జల్లుకుని పండుక చేసుకుంటాను" కసి తీర్చుకున్న పైశాచిక ఆనందంతో అన్నాడు ఆయన.

"ఇందుకే నాతో ఛాలెంజ్ చేశావా నువ్వు."

"మహామేధావికి ఇప్పుడర్థమైందన్న మాట. ఇందుకే అనాడు నిన్ను కిర్రెక్కించింది.....వెర్రెక్కించింది.....

పాత పగను, కక్షను దృష్టిలో పెట్టుకుని ఆ నాడు నా యిద్దరు పిల్లల ఆపరేషన్ కోసం లక్ష రూపాయల కోసం నన్ను పిచ్చికుక్కలా తిప్పించుకున్నావు ఆరు గంటలసేపు.......నేను పడిన క్షోభ, నరకయాతన నీ కారణంగా......నీ కారణంగా నా పిల్లలు మూగవాళ్ళయ్యారు.....చెవిటి వాళ్ళయ్యారు. అందుకే ఆనాడే నేను నిర్ణయించుకున్నాను. ఎప్పటికైనా నీ కొడుకుని నా కూతుళ్ళలాగా చెయ్యాలని అందుకే........ఆందుకేనా యావదాశినీ అందుకోసం పణంగా పెట్టాను. మాస్టర్ ప్లాన్ వేశాను......... రహస్యంగా పెరుగుతున్న నీ కొడుకుతో జీవితాంతం ఏడుపు.........గుడ్‌బై."

వెనక్కి తిరిగాడు దేశ్‌ముఖ్. ఒక్కసారిగా ఎదురుగా వచ్చి నిల్చున్నాడు మహంత. అతని చేతిలో మిలమిలా మెరుస్తూన రివాల్వర్.......

"సిద్ధార్థ ఎక్కడ?"

"వరల్డ్ వైడ్ నెట్ వర్క్ వుంది కదా తెలుసుకో'" ముందుకెళ్ళి బోయిన దేశ్‌ముఖ్ వైపు మహంత సూటిగా రివాల్వర్ గురిపెట్టి నుంచున్నాడు.

"నీకు బతుకు మీద ఆశ వుంటే సిద్ధార్థను నాకు అప్పగించు."

మహంత గొంతులోంచి తీవ్రంగా వచ్చాయి ఆ మాటలు. ఆ సమయంలో ఉన్మాదిలా వున్నాడు మహంత. అపురూపంగా కట్టుకున్న భవనం కళ్ళెదుటే కూలిపోతున్నట్టుగా వుందతనికి

అదే సమయంలో......

పెద్ద ఎత్తున చప్పట్లో వినిపించడంతో మహంత, దేశ్‌ముఖ్ ఇద్దరూ ఆశ్చర్యంగా తల తిప్పి చూశారు.

ఎదురుగా అచ్యుతముని!

"కన్నుల పండుగ్గా వుంది దృశ్యం! చిరకాలంగా ఎదురుచూస్తున్న అరుదయిన ఇన్‌సిడెంట్.........ప్రపంచ జీనియస్సుల్లారా........మహంతా.......దేశ్‌ముఖ్.....నువ్వు వాడి మీద, వాడు నీ మీద కక్ష తీర్చుకోవటం కాదుగా?

కుక్కల్లా మీరు కొట్లాడుకుంటే చూడాలని.......మీ ఇద్దర్నీ ఒకర్ని ఒకరు చంపుకుంటుంటే చూడాలని నేనెప్పుడో నాటిన విత్తనం యిది. సోదరిలా ఆదరించిన వసుంధరతో ఆనాడు నాకు ఆక్రమసంబంధాన్ని అంటగట్టారు నన్ను దారణంగా బిజినెస్ నుంచి గెళ్ళగొట్టారు నా పట్ల కనీసపు జాలి లేకుండా జంతువుల్లా ప్రవర్తించారు. అందుకే మీ తెలివి తేటలు, మీ అపారమయిన అనుభవం, మీ డబ్బు, మీ విధ్వంసం కోసం..........మీరే వుపయోగించుకునేట్లు చేశాను"

దేశ్‌ముఖ్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు అచ్యుతమునివేపు.

"మిస్టర్ మహంతా! నువ్వు నాకు ఎన్ని అన్యాయాలు చేశావో నీకు తెలుసు.......నాకు తెలుసు. మీ ఇద్దరిచేత అవమానింపబడి ఆత్మహత్య చేసుకోబోయిన మీ అక్క వసుంధరను ఆదుకున్నది నేను ఆస్పత్రిలో చికిత్స చేయించింది నేను చనిపోతే దహసంస్కారం చేయించింది నేను......

ఆమెకు పుట్టిన దేశ్‌ముఖ్ బిడ్డను అనాధాశ్రమంలో పెంచింది నేను....."

దేశ్‌ముఖ్, మహంత ఇద్దరూ షాక్ తిన్నట్టుగా చూశారు ఆ మాటకు.

ఒకరివేపు ఒకరు చూసుకున్నారు.

"వసుంధర బిడ్డను కని చనిపోయిందా?" డగ్గుత్తికతో అన్నాడు దేశ్‌ముఖ్.

"ఎస్ దేశ్‌ముఖ్! ఆ బిడ్డ ఎవరో తెలిస్తే నువ్విప్పుడే సూసైడ్ చేసుకుని చస్తావ్. ఎందుకో తెలుసా? మహంత మీద నీ కోపాన్ని తీర్చుకోటానికి నేను పంపిన నిశాంతను ఆయుధంగా ప్రయోగిస్తావని నాకు తెల్సు నిశాంతను ఆయుధంగా ఎవరి నివాసనం కోసం ప్రయోగించావో ఆ సిద్ధార్థ వసుంధర కొడుకు......అంటే నీ కొడుకే"

"సిద్ధార్థ.......నా కొడుకా?" ఆగాధం నుంచి నేలమీదకు కూలిపోతున్నట్టుగా వుంది ఆయన మనసు.

"అచ్యుతమునీ! ఆర్యూ ష్యూర్?" ఒకేసారి ముప్పిరిగొన్న మహంత కూడా ఆశ్చర్యపోయాడు.

"ఎస్ మహంతా! ఆ విషయం చచ్చిపోయిన నీ మొదటి భార్యకు తెలుసు....నాకు తెలుసు అక్కసు అక్కను శంకించి దూరం చేసుకుని తర్వాత బాధపడ్డావ్ నువ్వు. అపార్థం చేసుకుని బాధపడ్డావు దేశ్‌ముఖ్. ఆ రోజుల్లో మీకు బిజినెస్.......ఎత్తుగడలు..... రాజకీయం ట్రిక్కులు ఇవే ఈ ప్రపంచం. ఒకర్ని మించి ఒకరు డబ్బు సంపాదించాలని .......ఎదిగిపోయి......ఎత్తుకు ఎదిగిపోయి ఒకరి కాలితో ఒకర్ని తన్నాలని కక్ష తీర్చుకోవాలని డబ్బు కోసం యావ

అందుకే మీ ఇద్దరికీ వసుంధర గుర్తుకురాలేదు ఆమె చావుని మీ పట్టించుకోలేదు. వసుధర కొడుకుని పిల్లలు లేని తను దత్తద చేసుకుంటావని,వసుంధర కొడుకని ఎట్టి పరిస్థితిలో నా మీకు తెలియనివ్వనని సిద్ధార్థను నా నుంచి తీసుకెళ్ళింది మీ మొదటి భార్య

మహంతా! నీ శత్రువు కొడుకునే నువ్వు ఏ తండ్రి పెంచనంత గొప్పగా పెంచావ్. తన కొడుకునే నాశనం చేయటానికి తన అనుభవం మొత్తాన్ని వుపయోగించాడు దేశ్‌ముఖ్."

అచ్యుతముని నోటివెంట వస్తున్న ఒక్కొక్క మాటకూ గజగజా వణికిపోతున్నాడాయన.

"డబ్బుకోసం ఆత్మీయతల్నీ, అనుబంధాల్నీ లెక్క చెయ్యని మీ యిద్దరికీ ఎప్పటికయినా ఒక పాఠం నేర్పాలని అనుకున్నాను. దట్సాల్....... అరవయ్ నిమిషాల క్రితం వరకూ మీ యిద్దరితో ఓడిపోయినవాడ్ని నేను

మిమ్మల్ని ఓడించాలని, పరాభవించాలని, కుక్కలా తరమాలని, చంపి కసి తీర్చుకోవాలని అనుకున్నాను.

ఈ క్షణంలో నా నిర్ణయాన్ని మార్చుకున్నాను. ఎందుకో తెలుసా? దేశ్‌ముఖ్‌కి ఆ విషయం బాగా తెలుసు.

తన కొడుకుని తనే మూగవాడ్నీ, చెవిటివాడ్నీ చేసుకోడానికి తనే గుండాల్ని పంపుకున్నాడు.

మహంతా......నీ మేనల్లుడిలో ప్రేమను, ఆత్మీయతను నింపిన నిశాంత- ఎవరు కనిపించకపోతే ఇవాళ సిద్ధార్థ పిచ్చివాడైపోతాడో ఆ నిశాంతను- నిశాంతను నాశనం చెయ్యడానికి నువ్వు మనుషుల్ని పంపావ్.

గోటు హెల్..........గొప్ప బిజినెస్ మెన్స్‌కి వుండాల్సింది కేవలం డబ్బు, పగ, కక్ష, అధికారం మాత్రమే కాదు. ప్రేమ, మానవత్వం. అవి లేనప్పుడు మనశ్శాంతి లేదు..... రాదు...వెళ్ళండి.

వీలైతే రక్షించుకోండి.....మీరు సంపాదించిన కోట్లు వాళ్ళిద్దర్నీ కాపాడుతాయేమో చూడండి......గుడ్‌బై!"

విశాలమైన ఏ.సి రూమ్‌లో వాళ్ళు ముగ్గురు-

ఒకదర్పానికి,ఇంకొకరు పవర్‌కు, వేరొకరు కసిగా చిహ్నాల్లా వున్నారు.

"మహంతా.....సిద్ధార్థను....... రక్షించుకోవలి........మనం" ఎలుగెత్తి అరిచాడు దేశ్‌ముఖ్.

మహంత పరుగు పరుగున బయటికొచ్చాడు.

మహా ఆక్రోశానికి అంతిమ గీతాన్ని ఆలపించిన అచ్యుతముని.......

డబ్బును, ఆస్తినీ, హోదాను మరిచిపోయి పరిగెడుతున్న వాళ్ళిద్దరి వేపు చూసి-

నవ్వుతున్నాడు ఆ నవ్వులో ద్వేషం లేదిప్పుడు

గొప్ప సంతృప్తి వుంది

* * * * * * * *

మరో నలభై నిమిషాల తర్వాత

డిసి-8 స్పెషల్ ఫ్లయిట్ బొంబాయి ఎయిర్‌పోర్ట్ కొచ్చింది.

మహంత, దేశ్‌ముఖ్ కలిసికట్టుగా అందులోంచి దిగారు వాళ్ళిద్దరి మొహాల్లో బాధ, భయం, ఆందోళన, పుత్రప్రేమ అంటపెద్ద వ్యాపార వేత్తలు కూడా చిగురుటాకుల్లా వణికిపోతున్నారు.

అప్పటికే మహంత, దేశ్‌ముఖ్ మనుషులు- సిద్ధార్థ కోసం, నిశాంత కోసం గాలించడం మొదలుపెట్టారు. ఎక్కడ ఎక్కడా వాళ్ళ జాడ లేదు.

క్షణాలు........నిమిషాలుగా....నిమిషాలు గంటలుగా మారుతున్నాయి.

దేశ్‌ముఖ్ కిరాయి గూండాలు లేరు. మహంత పంపిన ప్రమోద్ మనుషులూ లేరు.

ఏమయ్యారు అందరూ?

మహంత, దేశ్‌ముఖ్ మొహాల్లో నెత్తురుచుక్కలేదు.

మూడుగంటల తర్వాత-

అకస్మాత్తుగా ఆయన దాదాపు ఆరుస్తూ అదే పనిగా ఫోన్లోమీద ఫోన్లు చేస్తున్న మహంత దగ్గరకొచ్చాడు.

"వాళ్ళెక్కడున్నారో నాకు తెలుసు. సిద్ధార్థను నిజంగానే ప్రేమించిన నిశాంత చాలా తెలివైంది సిద్ధార్థను, నన్ను కూడా లెక్కచేయకుండా ఆమె కాపాడి తీరుతుంది. నాకా నమ్మకం వుంది" అన్నాడు ఆయన ఒకింత తేరుకుంటూ.

మరో క్షణంలో వాళ్ళద్దరూ ఎయిర్‌పోర్ట్‌కి బయలుదేరారు.

బొంబాయి శాంతాక్రజ్ ఎయిర్‌పోర్ట్‌లో డిసి-8 స్పెషల్ ఫ్లయిట్ గాల్లో కెగిరి హైదరాబాద్ దిశ కేసి మరలింది.

* * * * * * * * * * * * *

గంగిరెడ్డిపల్లి.......

రాయలసీమ కరువుకి, పేదరికానికి, కన్నీళ్ళు ఒకప్పుడు నిదర్శనంగా వున్న గంగిరెడ్డిపల్లి-

పచ్చని పొలాలతో కళకళ్ళాడుతోందిప్పుడు

సిమెంట్ రోడ్లు, పెంకుటిళ్ళు, నిత్య దీపారాధనతో వెలిగిపోతున్న శివాలయం, భక్తుల సందడి-

హెల్త్ సెంటర్, ప్రైమరి స్కూల్, పొలాల్లో బావులు, సినిమా థియేటర్, సిటీనుంచి వచ్చే బస్సులు, బస్టాండ్.

ఊరంతా పెళ్ళిపందిరిలా వుంది.

శివాలయానికి కొంచెం దూరంలో ఒకప్పటి గుడిసె, ఇప్పుడు రెండంతస్తుల భవనం

మోగుతున్న మంగళవాద్యాలు.

పువ్వుల్లా విరుస్తున్న చిరునవ్వులు.

ఎటు చూస్తే అటు జనం.

ముహూర్తానికి ఇంకా పది నిమిషాల సమయముంది.

వరసగా పది కారులు చీమల బారుల్లా కనిపిస్తున్నాయి. అటూ ఇటూ పోలీస్ సెక్యూరిటీ.

మహంత ఆ గ్రామానికి వస్తున్న విషయం తెలిసిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్.పి.....స్వయంగా వెళ్ళడం జరిగింది.

వస్తున్న కార్లను, పోలీసుల్ని, హడావుడిని వింతగా చూస్తున్నారు జనం.

కారులోంచి దిగిన మహంత, దేశ్‌ముఖ్ ఇద్దరూ ముందుకు పరుగెత్తారు.

"సిద్ధార్థ ఎక్కడ?" దేశ్‌ముఖ్ గొంతులో కొట్లాడుతున్న మాటఅది.

"నిశాంత ఎక్కడ?" మహంత గుండె లోతులో ప్రతిధ్వనిస్తున్న మాట అది.

అప్పుడే-

ఓ గదిలోంచి పెళ్ళికూతురుగా తయారై నిశాంత బయటకొచ్చింది.

మరో గదిలోంచి పెళ్ళికొడుకుగా తయారైన సిద్ధార్థ వచ్చాడు.

ఇద్దరూ బయటికొచ్చారు.

ఆ ఇద్దరి పక్కన ఇద్దరి పక్కన ఇద్దరు అమ్మాయిలు. చిరునవ్వుల్తో తయారు చేసిన కర్పూరపు బొమ్మల్లా వున్నారు.

పరుగు పరుగున మెయిన్ గేట్‌లోంచి లోనికొస్తున్న దేశ్‌ముఖ్ వాళ్ళిద్దరి వేపు చూసి-

ఆశ్చర్యపోయాడు. ఆనందోద్వేగంతో పరవశించిపోయాడు.

వాళ్ళిద్దరూ దేశ్‌ముఖ్ కుమార్తెలు.

ఆయన కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

ఎదురుగా సిద్ధార్థ, నిశాంత.

మానవజాతిని తమ ప్రేమ ద్వారా పునీతం చేయడానికి వచ్చిన దేవదూతల్లా....

"బాబూ సిద్ధార్థా........"

"మొట్టమొదటిసారి దేశ్‌ముఖ్‌ను చూస్తున్నాడు సిద్ధార్థ

"అమ్మా............నిశాంత......."

ఏ మనిషి క్రౌర్యానికి, ఏ మనిషి అపార మేథాసంపత్తికి ప్రపంచం నీరాజనాలర్పించిందో-

సిద్ధార్థను దేశ్‌ముఖ్ ప్రేమగా కౌగలించుకున్నాడు.

"నా కొడుకు సిద్ధార్థను నేను చంపుకోబోయాను......నువ్వు......నువ్వు రక్షించావ్" దేశ్‌ముఖ్ అన్నాడు కృతజ్ఞతగా నిశాంత వైపు చూస్తూ

“సిద్దార్థను నేను గొప్పబిజినెస్‌మెన్‌ని చేయడానికి ప్రయత్నించాను. కానీ నువ్వు.......మనిషిని చేశావ్........గొప్ప మనిషిని చేశావ్” మహంత తడిదేరిన కళ్ళతో నిశాంత వైపు చూస్తూ అన్నాడు.

సిద్ధార్థ నిశాంత వైపు చూసి నవ్వాడు. కన్నీళ్ళతో నవ్వాడు.

మహంత వైపు, దేశ్‌ముఖ్ వైపు సూటిగా చేశాడు సిద్ధార్థ.

“చావు వరకూ వెళ్ళిన మమ్మల్ని బ్రతికించిన గొప్ప వ్య క్తి వేరొకరున్నారు డాడీ” లోనికొస్తున్న ఒక వ్య క్తి వైపు చూస్తూ అన్నాడు సిద్దార్థ.

ఒకరు పెంచిన తండ్రిన తండ్రి మేనమామ మహంత.

ఇంకొకరు కన్నతండ్రి దేశ్‌ముఖ్.

ఇద్దరూ మెయిన్‌గేట్ వేపు చూశారు.

చిరునవ్వుతో లోనికొస్తున్న అచ్యుతముని!

గబుక్కున అచ్యుతమునిని కౌగలించుకున్నాడు దేశ్‌ముఖ్.

* * * * * * * * * * * *

పట్టుబట్టల్తో, పెళ్ళి దండల్తో ఒక్కొక్కరికీ నమస్కరిస్తున్నారు సిద్ధార్థ నిశాంత.

నిశాంత కన్నతండ్రి యాదవరెడ్డి సుబ్బారెడ్డి దంపతుల వేపు సంతోషంగా చూశాడు.

కాళ్ళకు దండం పెట్టబోతున్న ఆ దంపతుల్ని పైకెత్తాడు మహంత.

“మొదట నాకు కాదు నమస్కారం చేయాల్సింది” అంటూ దేశ్ ముఖ్ వేపు చూశాడు మహంత.

దేశ్‌ముఖ్ వేపు వెళ్ళారిద్దరూ.

“నాకు కాదు......మీ మేనమామకు” నవ్వుతూ అన్నాడాయన.“

“మళ్ళీ ఏదో తగవు మొదలెట్టడానికి పెద్దవాళ్ళు తయారౌతురున్నారు గానీ, నా కాళ్ళకు మొక్కండి ఆక్షింతలు వేసేస్తాను” నవ్వుతూ అన్నాడు అచ్యుతముని.

మహంత, దేశ్‌ముఖ్ నవ్వారు ఆ మాటకు. తడిదేరిన కళ్ళను తుడుచుకుంటూ తన కాళ్ళకు నమస్కరించిన సిద్ధార్థను పైకెత్తి నుదుట మీద ముద్దు పెట్టుకుని-

పక్కనున్న నిశాంత వేపు చూశాడు దేశ్‌ముఖ్. పక్కనున్న ఇద్దరు కూతుళ్ళు చేతుల్ని తీసుకుని నిశాంత చేతిలోపెట్టి-

“ నా ఆస్తినీ, నా పిల్లల్ని నీకు అప్పగిస్తున్నాను” కన్నీళ్ళు నిండిన కళ్ళతో అన్నాడు దేశ్‌ముఖ్.

“నీకు గానీ, సిద్ధార్థకు గానీ నేనేమివ్వలేను ఎందుకో తెలుసా? నా కోట్ల ఆస్తితో నీ మనసును పోల్చి, నన్ను నేను కించపరుచుకోలేను అందుకే.....నా బిజినెస్ వరల్డ్‌కి సిద్ధార్థను కాకుండా నిన్ను చైర్మన్‌ని చేస్తున్నాను” అన్నాడు మహంత కృతజ్ఞత నిశాంతవేపే చూస్తూ

మహంత వేపు విస్తుపోయి చూసింది నిశాంత

“నువ్వడిగిన ప్రశ్నకు ఇప్పుడు జవాబు దొరికింది నిశాంత” మెల్లగా అన్నాడు సిద్ధార్థ

“ఏమిటి?”

“ఇఫ్ ఉయ్ కాల్ అరెంజ్‌స్ ఆరెంజెస్......వైడోంట్ ఉయ్‌కాల్ బనానాస్-ఎల్లోస్-ఆర్ ఆపిల్స్ రెడ్స్” రెడ్స్ జవాబుల్లేని రెండు ప్రశ్నల్లా, అంచనా వేయలేని ఆగాధాల్లా నుంచున్న మహంత, దేశ్‌ముఖ్ వేపు చూస్తూ అన్నాడు సిద్ధార్థ.

కళ్ళతోనే నవ్వింది నిశాంత. ఎన్నో ఆశలకు, ఆశలకు, ఆశయాలకు ఆకాంక్షలకు నిదర్శనాల్లా వున్నాయి ఆ కళ్ళు.

(అయిపోయింది)